క్లుప్తంగా

నేడు రొయ్యూరులో గడప గడపకు మన ప్రభుత్వం

తోట్లవల్లూరు: మండలంలోని రొయ్యూరులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

హెచ్‌ఐవీ పై అవగాహన

కాజ(మొవ్వ): ఎయిడ్స్ వ్యాధి బారిన పడిన వారు ఏఆర్‌టీ మందులు క్రమంగా వాడుతూ జీవితాన్ని కొనసాగించవచ్చునని, హెచ్‌ఐవీ ఉన్నవారి పై వివక్షత చూపవద్దని క్లస్టర్ లింక్ వర్కర్ నాగలక్ష్మి సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థల ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్‌ల సహకారంతో ఎయిడ్స్, టీబీ పై కాజ సచివాలయంలో అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అలాగే 50 మందికి హెచ్‌ఐవీ, టీబీ పరీక్షలు చేశారు. పంచాయతీ ఈవో ఏడీవీఎల్ ప్రసాద్, వీఆర్‌వో జేవీ రాఘవులు, ఏఎన్‌ఎం సముద్రవేణి, జి.జ్యోత్స్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, హెల్త్ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



తోట్లవల్లూరు: క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వ గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. రిపబ్లిక్ డే సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ ఈడే రవీంద్రబాబు కలెక్టర్ రంజిత్ బాషా నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. దీంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రవీంద్రబాబుని జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య శుక్రవారం శాలువాతో సత్కరించి అభినందించారు. డీటీ ధనలక్ష్మి, సామాజిక కార్యకర్త మత్తే విజయనాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు

గుడివాడటౌన్ : హజరత్ సయ్యద్ మొహీనుద్దీన్ బాబా గంధోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ముస్లిం సంచారజాతుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ సయ్యద్ ఆధ్వర్యంలో స్థానిక 11వ వార్డులో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబావారి గంధోత్సవాలు ప్రతి దర్గాలోనూ ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని పేర్కొన్నారు. పట్టణంలో సైతం ఈ కార్యక్రమం ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ బాజీ, ముస్లిం మతపెద్దలు షేక్ మౌలాలి, సయ్యద్ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

2న వైద్య శిబిరం

కైకలూరు: నియోజకవర్గంలో ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు వచ్చే నెల 2న కైకలూరు భవిత కేంద్రంలో వైకల్య నిర్ధారణ శిబిరం ఏర్పాటుచేస్తున్నట్టు ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను స్థానిక కార్యాలయంలో ఎంపీపీ అడవి కృష్ణ శుక్రవారం విడుదల చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో పంచాయతీ సెక్రటరీలు వలంటీర్ల ద్వారా వైద్య నిర్ధారణ శిబిరంపై ప్రచారం చేయించాలన్నారు. ఎంఈఓ డి.రామారావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల కలిగిన బాలబాలికలకు ఉచిత ఉపకరణాల పంపిణీ నిమిత్తం ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 6 నుంచి 18 సంవత్సరాల ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చే బాలబాలికలకు, తల్లిదండ్రులకు ప్రయాణ ఖర్చులు, ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈఓపీఆర్డీ రవిశంకర్, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ కార్యక్రమం

మండవల్లి: టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ కార్యక్రమంలో భాగంగా గన్నవరం ఎంపీపీ స్కూల్‌లో 3, 4, 5 తరగతుల విద్యార్థుల తెలుగు, గణిత సామర్థ్యాలను లింగాల కాంప్లెక్స్ సీఆర్పీ సుబ్రహ్మణ్యం పరీక్షించి వివరాలను టీఎఆర్‌ఎల్ యాప్‌లో శుక్రవారం అప్లోడ్ చేశారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే సీఎం ధ్యేయం



వడాలిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

ముదినేపల్లి రూరల్ : పేదలు ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. ముదినేపల్లి మండలం వడాలిలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం పైగా మహిళలకే కేటాయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలు పేదల కుటుంబాల్లో వెలుగు నింపుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో భవిష్యతులో ప్రతిపక్ష పార్టీలకు ఉనికి లేకుండా పోతుందన్నారు. దీర్ఘకాలం పాటు పథకాలు కొనసాగేందుకు సీఎంగా జగన్ మూడు దశాబ్దాల పాటు ముఖ్యమంత్రిగా ఉండాల్సిందేనని చెప్పారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు మాదు శివరామకృష్ణ, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ మరీదు దుర్గశ్రీ, ఎంపీటీసీ సభ్యురాలు పల్లి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మోత్రు ఏసుబాబు, నేతలు నిమ్మగడ్డ భిక్షాలు, బొర్రా శేషుబాబు, ఈడే వెంకటేశ్వరరావు, కోమటి విష్ణువర్ధన్, బేతపూడి వెంకటరమణ, లేళ్ల ఆంజనేయులు, గూడపాటి వరప్రసాద్, శీలం రామకృష్ణ, మత్రివాడ వీరారెడ్డి, ముంగర గోపాలకృష్ణ, బలే నాగరాజు, మరీదు హనుమంతు, రాధా, మరీదు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

150 రోజులు పూర్తి...

కైకలూరు నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి శుక్రవారం నాటికి 150 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వడాలిలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి పార్టీ శ్రేణులకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రస్తుతం ఉన్న ప్రజాస్పందనను చూస్తే 175 అసెంబ్లీ సీట్లు సాధించడం విశేషం కాదన్నారు. పథకాల లబ్ధి పార్టీలకతీతంగా అర్హులందరికీ అందుతోందని చెప్పారు. ప్రజలు, ప్రత్యేకించి మహిళల నుంచి విశేషంగా మద్దతు లభిస్తోందని తెలిపారు.

పట్టణంలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి

ఎమ్మెల్యే కొడాలి నాని



ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్

గుడివాడటౌన్: పట్టణంలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆదేశించారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య మెరుగుదల పనుల్లో భాగంగా చెత్త కుండీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్టీఆర్ కాలనీ ఇతర ప్రాంతాల వారు రోడ్లపైనే చెత్త వేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని నివారించేందుకు కృషి చేస్తూ ప్రజల సౌకర్యాలలో ఏ విధమైన ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని సూచించారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు చంటి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు పంపిణీ చేసేందుకు సమాయత్తం



సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

గుడివాడటౌన్: టిడ్కో ఇళ్ల పంపిణీకి అడ్డంకులన్నీ తొలగించి లబ్ధిదారులకు పంపిణీ చేసేలా సమాయత్తంకావాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం టౌన్ ప్లానింగ్, సచివాలయ ఉద్యోగులు, మెప్మా ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 21వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరగాల్సి ఉండగా అది అనివార్య కారణాల వలన వాయిదాపడిందని చెప్పారు. రుణాల మంజూరు విషయంలో అడ్డంకులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మరొక్కసారి లబ్ధిదారులు, బ్యాంక్ అధికారులతో సమీక్ష నిర్వహించి రుణం మంజూరుకావాల్సిన లబ్ధిదారులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. అందుకు కావాల్సిన అన్ని పత్రాలను సమకూర్చి వారికి రుణం మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఫిబ్రవరి మాసంలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పంపిణీ ముఖ్యమంత్రి చేతులమీదుగా జరిగే సూచనలు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ వై.రాంబాబు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పి.నాగేంద్ర ప్రసాద్, మెప్మా సీఎంఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ నారాయణ శర్మ



జీఎం ఓం నారాయణశర్మ తదితర ముఖ్య అధికారులను సన్మానిస్తున్న మేనేజర్ ఉషా మాధురి

పామర్రు: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి నెట్‌వర్క్–2 జనరల్ మేనేజర్ ఓం నారాయణ శర్మ అన్నారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ శాఖను ఆయన బ్యాంక్ అధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతనమైన యోనో యాప్ ద్వారా సైబర్ నేరాలు నివారిస్తున్నామని చెప్పారు. ఈ యాప్ ద్వారా ఎకౌంట్ ప్రారంభించడంతో పాటు ఫండ్ సైతం ట్రాన్స్‌ఫర్ చేయవచ్చన్నారు. యోనో క్యాష్ సౌకర్యం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. యోనో కృషి ద్వారా రైతులకు వ్యవసాయ రుణాల దరఖాస్తు సదుపాయం, బీమా సేవలు, మిత్రా–వ్యవసాయ సలహా కేంద్రం, అన్ని వ్యవసాయ అవసరాలకు రుణాలను సకాలంలో అందిస్తున్నామని చెప్పారు. సరళమైన వడ్డీలతో వ్యవసాయ రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. పొదుపు ఎకౌంట్‌ల ద్వారా పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్సు, మోటర్ ఇన్సూరెన్సు, హెల్త్, లైఫ్ ఇన్సూరెన్సులను అందజేస్తున్నామన్నారు. వ్యక్తిగత, భూమి, పంట వివరాలను నిర్ధారించుకుని కిసాన్ క్రెడిట్ కార్డును పొందవచ్చని చెప్పారు. వ్యవసాయ సంబంధితమైన గ్రామీణ గోడౌన్, కోల్డ్ స్టోరేజ్, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్స్, పౌల్ట్రీ, కంబైన్ హార్వెస్టర్స్, హార్టికల్చర్ గార్డెనింగ్, డైరీ షెడ్స్ తదితరాలకు రుణాలను తక్కువ వడ్డీలకు అందిస్తున్నామని వెల్లడించారు. ఎడ్యుకేషన్ రుణాలను సైతం అందజేస్తున్నామని వివరించారు. పాన్, ఆధార్ వివరాలను ఎవ్వరికీ ఇవ్వవద్దని సూచించారు. ఓటీపిని ఎవ్వరికీ చెప్పవద్దన్నారు. అనంతరం బ్యాంక్ అధికారులను శాలువాలు, పుష్పమాలలతో సన్మానించారు. బ్యాంక్ ఏజీఎం ఫణిరామ్‌కుమార్, డీజీఎం రంగరాజన్, యూనియన్ జనరల్ సెక్రటరీ భవాని ప్రసాద్, పామర్రు బ్యాంక్ మేనేజర్ పరసా ఉషా మాధురి, యూనియన్ లీడర్ కొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో వల్మీకేశ్వరీ అమ్మవారు

పామర్రు: స్థానిక వల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చివరి రోజున అమ్మవారిని ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం సాయింత్రం అమ్మవారిని ట్రాక్టర్‌పై గ్రామ పురవీధుల వెంబడి మేళ తాళాలతో మహిళల భజన కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం అంత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు బి. రామకృష్ణారెడ్డి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యురాలు స్వాతి

ముదినేపల్లి రూరల్: ఎయిడ్స్, టీబీ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని గురజ పీహెచ్‌సీ వైద్యురాలు స్వాతి అన్నారు. గురజలో చైల్డ్ ఫండ్ ఇండియా వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఎయిడ్స్, టీబీలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. స్వాతి మాట్లాడుతూ వ్యాధుల నిర్ధారణ, నివారణకు వైద్యపరీక్షలు, మందులు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. హెచ్‌ఐవీ బాధితులు ఏఆర్టీ మెడిసెన్ విధిగా వాడుకోవాలని సూచించారు. చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ డీఆర్పీ సురేష్‌కుమార్, సూపర్‌వైజర్ పి.వెంకటేశ్వరరావు, లింక్ వర్కర్ జె.చంద్రావతి, సచివాలయ కార్యదర్శి హారిక, సీహెచ్‌ఓ ముత్తయ్య, పీహెచ్‌సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీ కార్యదర్శి సలీమ్‌కు సత్కారం



కార్యదర్శి సలీమ్‌ను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు తదితరులు

పామర్రు: పంచాయతీ గ్రేడ్–1 కార్యదర్శి అబ్దుల్ సలీమ్‌కు ప్రతిభా పురస్కారం అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పలువురు ఆయన్ని సన్మానించారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామానికి వచ్చిన అనతి కాలంలోనే ఎన్నో సేవలను అందించారని తెలిపారు. గ్రామస్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా పారిశుధ్య, డ్రెయినేజీ పనులు నిరంతరం నిర్వహిస్తున్నారని చెప్పారు. పంచాయతీ ద్వారా అనేక రహదార్ల ఏర్పాటుకు తగు విధంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కె.కస్తూరి, పాల సేకరణ కేంద్రం అధ్యక్షుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి నారాయణరెడ్డి, మండల రైతు సలహా మండలి అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వార్డు మెంబరు ఏ శ్రీహరి, పార్టీ నాయకులు కందుల నరసింహారావు, బి.మాధవరెడ్డి, ఎండీ జమీల్ తదితరులు సన్మానం చేసిన వారిలో ఉన్నారు.

ప్రతి నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల నిర్మించాలి



మాట్లాడుతున్న కె అశోక్

గుడివాడటౌన్: రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.అశోక్ డిమాండ్ చేశారు. కేటీఆర్ మహిళా కళాశాల ఆడిటోరియంలో ఎస్ఎఫ్ఐ 49వ జిల్లా మహాసభలు శుక్రవారం ఆయన ప్రారంభించారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రతి మండలంలోనూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. జీఓ నెంబర్ 77 రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కె సుఖేష్, కార్యదర్శి పి పవన్‌కుమార్, గుడివాడ కార్యదర్శి సమరం, సభ్యులు పవన్, కళ్యాణ్, ఐద్వా కార్యదర్శి జ్యోతి, సీపీఎం నాయకులు వై నరసింహారావు, ఆర్‌సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతివ్వాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

గుడివాడటౌన్: బీసీల ఆరాధ్య దైవం జ్యోతీరావ్ పూలే ఆయన సతీమణి సావిత్రీభాయ్ పూలే విగ్రహాల ఏర్పాటుకు మున్సిపల్ అనుమతులు ఇవ్వాలని బీసీ సంఘ నాయకులు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఈ మేరకు కమిషనర్ వి.మురళీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మెయిన్‌రోడ్‌కు సమీపంలోని ముగ్గుబజార్ రోడ్‌లో విగ్రహాలు ఏర్పాటు చేయాలని బీసీ సంఘాలు నిర్ణయించాయన్నారు. విగ్రహాలకు అయ్యే ఖర్చు ఎమ్మెల్యే కొడాలి నాని అందిస్తానని హామీ ఇచ్చారన్నారు. మున్సిపల్ అనుమతులు లభిస్తే బీసీ సంఘం ద్వారా విగ్రహాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ స్థలాన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగస్తి ఆదివిష్ణు, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్, జిల్లా ఉపాధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారు బండారు రాధాకృష్ణ, గుడివాడ నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహరావు, మహిళా అధ్యక్షురాలు యశోధయామినీ దేవి, ఉపాధ్యక్షుడు నయనవరపు శేషుబాబు, టి.రమణకుమార్, ప్రధాన కార్యదర్శి తుమ్మ రమేష్, ఎస్ రంగారావు, జి.సూర్యనారాయణ, నెరుసు శ్రీనివాసరావు, ఎం. వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరి సహకారంతోనే అవార్డు

పెదపారుపూడి: కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదగా ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన తహసీల్దార్ వి. నాగభూషణం, ఏఎస్‌వో కళ్లేపల్లి రామరత్నారావును మండల కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్‌ఏలు శుక్రవారం సన్మానించారు. వీఆర్వో మండల సంఘం అధ్యక్షుడు చాట్ల అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వీఆర్వోలు తహసీల్దార్ నాగభూషణంను పుష్పగుచ్ఛాలు, పూలమాలలు వేసి సన్మాంచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ చేతుల మీదగా తీసుకున్న అవార్డు అందరి కృషి ద్వారా వచ్చిందని చెప్పారు. రీసర్వేలో వీఆర్వోలు, సహకారంతో చాలా వరకు పూర్తి చేశామని పేర్కొన్నారు. నాగాపురం సర్పంచ్ నాగదేశి సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి సాగరరాణి సన్మానించారు. మండల సర్వేయర్ అప్పారావు, వీఆర్వోలు ప్రసాద్, దానియేలు, వీఆర్‌ఏలు నాగేశ్వరరావు, ప్రేమ్, చుక్కమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

కైకలూరు: గ్రామ పంచాయతీ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు దోమతోటి అబ్రహాం ఆధ్వర్యంలో వేమవరప్పాడులో శుక్రవారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ నున్న రాంబాబు ప్రారంభించారు. గుండె, ఎముకలు, చెవి, ముక్కు, కన్ను, చర్మ, స్త్రీల సంబంధిత వ్యాధులపై 150 మందికి ఏలూరు ఆశ్రం హాస్పటల్ వైద్యులు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరాజు, ఉపసర్పంచ్ జాజుల రాజు, మోహనరావు, సత్యనారాయణ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి

పసుమర్రు(పామర్రు): ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎవ్వరూ ఇబ్బందులు పడకుండా తగు విధమైన జాగ్రత్తలు వహించాలని తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి తెలిపారు. మండల పరిధి పసుమర్రు, జుఝువరం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు తమ ధాన్యం నమూనాలను కొనుగోలు కేంద్రం వద్ద తీసుకురావాలని సూచించారు. రైతులు ఎవ్వరు మిల్లర్ల వద్దకు వెళ్ల నవసరం లేదని స్పష్టం చేశారు. కేంద్రం వద్ద ధాన్యం ఓకే అయిన 21 రోజులకు రైతుల ఎకౌంట్‌లలోకి నగదు జమ అవుతుందని తెలిపారు. రవాణా, హమాలీ చార్జీలను సైతం ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ రాము, కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి గ్రామానికి చెందిన కైలా పాల్ ప్రభాకర్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.10 వేలను శుక్రవారం అందచేశారు. వైస్ ప్రెసిడెంట్ కైలా లక్ష్మీ, పంచాయితీ ఈవో ఈ భవానీ, వార్డ్ నెంబర్ కాపూరి పూర్ణ చంద్ర శర్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమా మహేశ్వరరావు, వలంటీర్ మద్దగౌరీ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మండవల్లి: అగరుబత్తి తయారీ, కంప్యూటర్ డీటీపీ, సెల్‌ఫోన్ మరమ్మతులు, డ్రస్ డిజైనింగ్ (టైలరింగ్), కలంకారీ ప్రింటింగ్, పేపర్ బ్యాగ్స్ తయారీ, రోల్డ్‌గోల్డ్ నగల తయారీ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు ఎంపీడీఓ పి.మల్లీశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 30 నుంచి 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల రైతుమిత్ర సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ యువత, స్త్రీలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కొన్ని కోర్సులకు పదో తరగవతి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు.

క్రీడాకారులకు కిట్‌లు పంపిణీ



విద్యార్థులకు క్రీడా కిట్లను అందజేస్తున్న దాతలు

జమీదగ్గుమిల్లి(పామర్రు): క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు క్రీడా కిట్‌లను పంపిణీ చేశామని హెచ్‌ఎం చుక్కా రాజన్ తెలిపారు. జమీదగ్గుమిల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు దాతలు క్రీడా కిట్‌లను బహూకరించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పోలవరం గ్రామ సంక్షేమ సేవా ట్రస్టు చైర్మన్ మల్లా వీరబాబు సౌజన్యంతో క్రీడాకారులు కిట్‌లు అందజేశారని చెప్పారు. 2022–23లో పదవ తరగతిలో మూడవ ర్యాంక్ సాధించిన దేవనబోయిన తేజస్వికి ట్రస్టు తరపున డిక్షనరీని అందజేశారన్నారు. ఎం. అనిల్‌కుమార్, వెన్నా కుటుంబరావు, మల్లా అంజయ్య, మట్టా వాసు, ఎం.పూర్ణచంద్రరావు, శేషగిరిరావు క్రీడాకారులకు ప్రయాణ ఖర్చులను అందజేశారని పేర్కొన్నారు. పోలవరం గ్రామ సర్పంచ్ మట్టా శ్రీలక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఆలపాడు గ్రామంలో రూ.21.50 లక్షలతో నిర్మించనున్న పీఏసీఎస్ భవనానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీపీ అడవి కృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పడమటి శేషావతరం, ఎంపీటీసీ సభ్యురాలు నల్లగచ్చు ధనలక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భత్రాజు శివాజీ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, ఉపసర్పంచ్ సలాది జ్యోతి, నాయకులు ముంగర నరసింహారావు, సుందర రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే వాహనాల సీజ్



కైకలూరులో వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కలిగిస్తున్న పట్టణ సీఐ నాగరాజు

కైకలూరు: హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే వాహనాలను సీజ్ చేస్తామని సీఐ ఎంవీఎస్ నాగరాజు హెచ్చరించారు. యువకులకు హెల్మెట్ ఉపయోగాలపై శుక్రవారం అవగాహన కలిగించారు. సీఐ మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు తీవ్ర గాయాలై మరణిస్తున్నారని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.